

27న బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి పెద్దాపురం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 27వ తేదీన రామచంద్రపురం గవర్నమెంట్ జూనియర్ కళాశాల గ్రౌండ్లో జరుగుతాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ముప్పన వీరభద్ర స్వామి, సీతాపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు నవంబర్ 8, 9 ,10 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే 9వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాల కోసం 9491426280 నెంబర్‌లో సంప్రదించవచ్చున్నారు.


ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు..?

- చెల్లింపులపై విద్యార్థులపై పెరిగిన ఒత్తిళ్లు
- ఫీజులు, పరీక్షలకు యాజమాన్యాల లింకు
- ఆగమ్యగోచరంగా విద్యార్థుల పరిస్థితి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ విద్యా పథకాల ఉసెత్తడం లేదు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుపై నేటికీ స్పష్టత రాకపోవడంతో ఉన్నత విద్య చదువుతున్న పేద, సామాన్య విద్యార్థుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులపై ఆశలు పెట్టుకున్న వీరంతా ఇప్పుడు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినప్పటికీ ఈ పథకంపై కనీసంగానైనా ఎటువంటి ప్రకటనా చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నాయి. నిర్వహణ భారంగా మారిందనే కారణంతో ఫీజులు కట్టకపోతే పరీక్షలు సైతం రాయనీయబోమని పరోక్షంగా సందేశాలు ఇస్తున్నాయి.

కాకినాడ జిల్లాలో జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల, సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల, పెద్దాపురం మండలం దివిలిలోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ, కాకినాడలోని ఐడియల్, కోరంగిలోని కైట్, పటవలలో



పైడా తదితర ఇంజినీరింగ్ కళాశాలల్లో దాదాపు 20 వేల మంది విద్యార్థులు నాలుగేళ్ల పరిధి ఉన్న వివిధ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్నారు.

ఫీజుల కోసం పెరిగిన ఒత్తిళ్లు

ఇంజినీరింగ్ విద్యలో నాలుగు సంవత్సరాల కోర్స్ కోసం పేద, మధ్య తరగతి విద్యార్థులు ఆయా కళాశాలల్లో చేరారు. ప్రభుత్వం ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో భాగంగా సంవత్సరానికి రూ.35 వేలు గత ప్రభుత్వ హయాంలో వచ్చేది. వైసిపి ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మూలంగా మూడేళ్ళ పాటు అసంపూర్తిగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ అందింది. అది కూడా పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందని పరిస్థితి నెలకొంది. రూ.35 వేలలో కొందరికి సగం, మరికొందరికి ఒకటే నాలుగో వంతు మాత్రమే జమ అయ్యేది. ఇలా అరకొర సొమ్ములే ఖాతాల్లో పడుతుండడం వల్ల అప్పులు చేసి కళాశాలలకు ఫీజులు చెల్లించే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.3 వేల కోట్లు బకాయిలు ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇక నుంచైనా సాంకేతిక విద్య సక్రమంగా అందుతుందని భావించారు. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా కనబడుతున్నాయి.

వచ్చే నవంబరు, డిసెంబరు నెలల్లో సెమిస్టర్ ఎగ్జామ్స్ ఉండటం వల్ల పరీక్ష ఫీజు రుసుమును ఆయా యాజమాన్యాలు కట్టించుకోవడం నిలుపుదల చేశాయి. రీయింబర్స్‌మెంట్ పథకంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో పరీక్ష ఫీజు కట్టించుకోవాలంటే ట్యూషన్ ఫీజు కచ్చితంగా చెల్లించాల్సిందే అంటూ ఒత్తిళ్లు చేస్తున్నాయి. కనీసంగా సగం ఫీజు అయిన ఇవ్వాలంటూ తల్లిదండ్రులకు సమాచారం ఇస్తున్నారు.

మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయాలంటే కనీసంగా రూ.30 వేల నుంచి 60 వేలు అయినా చెల్లించాల్సిందే అంటూ స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని పేద విద్యార్థులతో పాటు వారు తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



గాలిలో విద్యార్థుల భవిష్యత్తు

విద్యా సంవత్సరం ప్రారంభించి ఇప్పటికే 5 నెలలు కావస్తోంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటై 5 నెలలు అవుతోంది. మరో రెండు నెలల్లో సెమిస్టర్ పరీక్షలు జరగబోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు ఇస్తాయో ఎంత ఇస్తాయో స్పష్టత లేకపోవడంతో యాజమాన్యాల నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి.

- ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



ప్రభుత్వం వెంటనే స్పందించాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఆయా కళాశాలల నుంచి ట్యూషన్ ఫీజు చెల్లించాల్సిందిగా ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ పథకంపై వెంటనే సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలి.

- సిహెచ్. సాహిత్, ఇంజినీరింగ్ విద్యార్థి.

నీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి

ప్రజాశక్తి-కాకినాడ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నిర్ణయించనున్న నేప˜థ్యంలో కలెక్టర్ శనివారం కలెక్టరేట్ లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో గోదావరి, ఏలేరు, పంపా, సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు కింద ఇప్పటికే నీటి సంఘాలు ఉన్నాయని, దీనికి సంబంధించి ప్రాదేశిక నియోజకవర్గం వారీగా అడంగల్ అనుసరించి రైతులు వివరాల జాబితా సిద్ధం చేయాలన్నారు. తూర్పు ఆయకట్టు కింద నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాదేశిక నియోజకవర్గం పరిధి నిర్ణయించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన గడువులోపు జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పేనాయక్, ఇరిగేషన్ ఎస్ఇ జి.శ్రీనివాసరావు, ఇఇ శేషగిరిరావు, కాకినాడ, పెద్దాపురం డిఇ ఎం.రవి, కాకినాడ, ఆర్.పోచారావు, పుష్కర కెనాల్ ఇఇ రాజేశ్వరరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.

రైతుబజార్ల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ



రైతు బజార్‌లో తనిఖీలు చేస్తున్న జెసి రాహుల్ మీనా

రైతు బజార్ల అభివద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. శనివారం ఆయన కాకినాడ ఆర్‌టిసి కాంప్లెక్స్ పక్కనున్న రైతు బజారును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఉల్లిపాయలు, ఆయిల్, టమోటో, బియ్యం, కందిపప్పు కౌంటర్లని, వాటి నాణ్యతను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం షెడ్లలో రైతులు కూరగాయలు అమ్ముతుండడం వల్ల వర్షాలు కురుస్తున్న సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వ్యాపారులు జాయింట్ కలెక్టర్ ద దృష్టికి తీసుకొచ్చారు. రైతు బజారుకి వచ్చే వినియోగదారుల వాహనాలను ప్రధాన మార్గంలో నిలపడం వల్ల ట్రాఫిక్ నియంత్రణ కష్టంగా మారిందని వివరించారు. వ్యాపారుందరికీ అనుకూలంగా ఉండేలా పక్కా భవనాన్ని నిర్మించి స్టాల్స్ ఏర్పాటు చేయాలని జెసిని కోరారు. రైతు బజార్ మార్గానికి సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని అధికారులు జాయింట్ కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లారు.

కచేరిపేటలో మద్యం షాపు తొలగించాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ 37వ డివిజన్ కచేరిపేటలో యుటిఎఫ్ టీచర్స్ హోమ్ పక్కన బ్రాందీ షాపు తొలగించి, ఎక్సైజ్ అధికారులు హామీ నిలబెట్టుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకట రమణ, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యుటిఎఫ్ టీచర్స్ హోమ్‌లో ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు, సైన్స్, సామాజిక, అభ్యుదయ సంఘాల వారు నిరంతరం సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించుకుంటారన్నారు. కొంత కాలంగా ఆ ప్రాంతంలో బ్రాందీ షాపు తొలగించాలని కలెక్టర్ కార్యాలయ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆ సమయంలో ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ నూతన ఎక్సైజ్ పాలసీ అమలు సమయంలో ఆ ప్రాంతంలో షాప్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వబోమని చెప్పారని తెలిపారు. తాజాగా మరలా బ్రాందీ షాపు ఏర్పాటు చేసి బార్‌లా నడిపేస్తున్నారని విమర్శించారు. ఆ రోడ్‌లో విపరీతంగా ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందన్నారు. బ్రాందీ షాపు తొలగించకుంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



లోగో ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా మహాసభ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

నవంబర్ 15, 16, 17 తేదీలలో పెద్దాపురంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభల లోగోను పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు ఆవిష్కరించారు. శనివారం యాసలపు సూర్యారావు భవనంలో పార్టీ మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లోగో ఆవిష్కరణ అనంతరం కరణం ప్రసాదరావు మాట్లాడారు. ప్రజా సమస్యలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా సిపిఎం పోరాటాలు చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగం, ప్రజాతంత్ర లౌకిక విలువలపై దాడులు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలను చైతన్యవంతుల్ని చేయవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహాసభల విజయవంతానికి ప్రజలు అన్ని రకాలుగా చేయూతనిచ్చి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, కేదారి నాగు, గడిగట్ల సత్తిబాబు, పెంటయ్య, కృష్ణ, సుబ్బలక్ష్మి, గాడి సత్యవతి, క్రాంతి కుమార్, విశ్వనాథం పాల్గొన్నారు.

బాలల సంక్షేమం, పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

బాలల సంక్షేమం, పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్‌డిఒ శ్రీరమణి అన్నారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాల నిర్మూలన చట్టం, బాలల పరిరక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలో బాల్య వివాహాల నిరోధానికి అందరూ కృషి చేయాలన్నారు. దీనికి సంబంధించి విస్తతంగా ప్రచారం చేసి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలన్నారు. బాల్య వివాహాల నిరోధనలో ఇబ్బందులు ఎదురైతే తమ దష్టికి తీసుకురావాలన్నారు. వీధి బాలలను, భిక్షాటనలో ఉన్న బాలలను గుర్తించి వారికి రక్షణ కల్పించి విద్యాలయాల్లో చేర్పించాలన్నారు. ప్రతి మండలంలో మండల స్థాయి అధికారి గ్రామస్థాయి, మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే ఆ వివాహాలు జరపడానికి కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.ప్రవీణ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం పిఒ కె.విజయ, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, సిడిపిఒ జి.ఉష, తహశీల్దారు వెంకటలక్ష్మి, ఎంఇఒలు వర్మ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

యుఎస్‌లో విద్య, ఉద్యోగావకాశాలపై అగాహన


ప్రజాశక్తి-కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో యూఎస్ఎ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. విద్యార్థులకు విదేశీ చదువుల ప్రాముఖ్యత, ఉద్యోగావకాశాలపై అవగాహన కలిగించే ఉద్దేశంతో ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'అమెరికాలో విద్య ఉద్యోగ అవకాశాలపై సదస్సు' నిర్వహించారు. అమెరికాలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ప్రతినిధులు డైరెక్టర్ కష్ణమోహన్ ఆధ్వర్యంలో పాల్గొని ఆదిత్య డిగ్రీ విద్యార్థులతో వివిధ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, కెరీర్ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ విద్య గురించి, విదేశాల్లో ఉద్యోగావకాశాలపై అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి చెందాలని, నేటి విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విదేశీ విద్య, ఉద్యోగావకాశాలపై నిర్వహించిన సదస్సులో ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు మాట్లాడిన అంశాలను విద్యార్థులు తెలుసుకొని తమకు ప్రయోజనకరంగా మలుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి మూర్తి, ప్లేస్మెంట్ కో ఆర్డినేటర్ విఎస్ఎన్ కుమార్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



బడి ఈడు పిల్లల శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

బడిబయట పిల్లలు ఉండరాదు అనే ఉద్దేశంతో సామర్లకోటలో పెద్దపులి చెరువు ప్రాంతంలో నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు డిఇఒ పి.రమేష్ తెలిపారు. శనివారం పెద్దపులి చెరువు ప్రాంతంలో భిక్షాటన చేసుకొని జీవిస్తున్న కుటుంబాల సంబంధించిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన బడి బయట పిల్లల ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం బడిఈడి గల పిల్లలు బడిలోనే ఉండాలని అన్నారు. 6 నుండి 18 ఏళ్ల లోపు గల పిల్లలు ఎక్కడా చదువుకోకుండా బయట తిరగరాదన్నారు. వేరే ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్న తల్లిదండ్రులకు సంబంధించిన 21 మంది పిల్లలను గుర్తించి ఈ పాఠశాల ఏర్పాటు చేసినట్ల చెప్పారు. అనంతరం శిక్షణ కేంద్రంలో పిల్లలకు డిఇఒ రమేష్ టెస్ట్ బుక్స్ పంపిణీ చేశారు. పుస్తకాలను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారి సిహెచ్.వెంకటరావు, జిల్లా చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసు, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఎఎల్ఎస్ కో ఆర్డినేటర్ కె.హరికృష్ణ, సిఆర్‌పిలు ఎ.వీర్రాజు, కె.ఉమామహేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, కె.తనూజ, కె.నాగమణి, శిక్షణా కేంద్రం వాలంటీర్ బొడ్డు ప్రవీణ్, హెచ్ఎం నాగేశ్వరరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలువురు ప్రజాప్రతినిధులు శనివారం అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని సుమారుగా రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ పేర్కొన్నారు. శనివారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా కరప, పెనుగుదురు, నడకుదురు, గురజనాపల్లి, ఉప్పలంక గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ నానాజీ శంకుస్థాపన చేశారు. తొలుత కరప చివరి పేపకాయలపాలెంలోని గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోని మాజీ మంత్రి చిక్కల రామచంద్రరావు, వెంకీ శ్రీనివాస్ బాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, భోగిరెడ్డి కొండబాబు, బండారు మురళి, భోగి రెడ్డి గంగాధర్, యాళ్ల పండు, తుమ్మలపల్లి మాచర్లరావ్ రెడ్డిపల్లి నారాయణరావు, రెడ్డిపల్లి భాస్కర్, గంట నానిబాబు, మెండు గోవిందు పాల్గొన్నారు.



కాకినాడ రూరల్‌లో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నానాజీ

ఏలేశ్వరం మండలంలోని మర్రివీడు, లక్ష్మీపురం జె.అన్నవరంలో అభివృద్ధి పనులకు ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ శంకుస్థాపనలు చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, ఎంపిపి గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు.

కిర్లంపూడి జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి, భూపాలపట్నం, గోనేడ గ్రామాల్లో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, జెడ్‌పిటిసి తోట గాంధీ, టిడిపి మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, వీరంరెడ్డి కాశిబాబు, అల్లు విజయకుమార్, నీలం శ్రీనివాస్, గండే చెల్లారావు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

పెద్దాపురం మండలం చదలాడ, తిరుపతి, దివిలిలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ చినరాజప్ప శంకుస్థాపన చేశారు. జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, ఎంపిపి పెంకే సత్యవతి, తుమ్మల పద్మజ, టిడిపి మండల అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, మొయిళ్ల కృష్ణమూర్తి, తోట రామకృష్ణ, తుమ్మల నాని, రేలంగి బుజ్జి, కొమ్మిరెడ్డి బుజ్జి, రాగాల ఉమామహేశ్వరరావు, నల్ల బాబు, ఉపాధి హామీ పథకం పీడీ అడపా వెంకటలక్ష్మి, ఎపిడి భాను ప్రకాష్, ఎపిఒ ప్రభాకరరావు, జెఇ సతీష్, ఎఇ శ్రీనివాస్, రేలంగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బీమాతో కుటుంబానికి భరోసా

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విశ్వనాథం తదితరులు

ప్రతి కుటుంబానికీ బీమా పథకాలు భరోసా కల్పిస్తాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ తప్పక బీమా చేయించుకోవాలని యూనియన్ బ్యాంక్ కాకినాడ రీజియన్ చీఫ్ మేనేజర్ ఎం.విశ్వనాథం అన్నారు. తాళ్ళరేవు ఆర్యవైశ్య సంఘ భవనంలో శనివారం జన సురక్ష ప్రచారంలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏడాదికి రూ.20 బీమా చెల్లించడం ద్వారా పాలసీ తీసుకున్న వ్యక్తి ఏదైనా ప్రమాదానికి గురైతే రూ.2 లక్షలు బీమా మొత్తం అందజేస్తామన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో భాగంగా 18 నుంచి 70 ఏళ్లలోపు ప్రజలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో భాగంగా 18 నుంచి 50 ఏళ్లలోపు వారు ఏడాదికి రూ. 430 లు చెల్లిస్తే బీమా తీసుకున్న వ్యక్తి ఏ విధంగా మరణించిన రూ.2 లక్షలు కుటుంబ నామినికి బ్యాంకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఎల్‌డిఎం సిహెచ్ఎస్‌వి.ప్రసాద్, ఎఫ్ఎల్‌సిసి కో ఆర్డినేటర్ పి.అప్పిరెడ్డి, విజయలక్ష్మి, తాళ్లరేవు యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.లోవ కృష్ణ, స్థానిక సిబ్బంది ప్రసన్న, రమణ పాల్గొన్నారు.

అస్సాగో పరిశ్రమకు వ్యతిరేకంగా దీక్షకు సిద్ధం

ప్రజాశక్తి-గండేపల్లి

గుమ్మళ్లదొడ్డిలో ఈథైల్ ఆల్కహాల్ కాలుష్య కారక పరిశ్రమకు వ్యతిరేకంగా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌ఛార్జి మరోతి శివ గణేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏ విధమైన ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా గ్రామాలను ఆనుకొని, జనావాసాల మధ్యలో జల వాయు శబ్ద కాలుష్య కారక అసాగో ఈథైల్ ఆల్కహాల్ పరిశ్రమ నిర్మాణం వల్ల గుమ్మళ్లదొడ్డి, అచ్చుతాపురం, బాబాజీపేట, వెదురుపాక గ్రామాల్లో ప్రజలు వాయు శబ్ద కాలుష్యాలతో దౌర్భాగ్యాన్ని అనుభవిస్తున్నారు. గర్భిణులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారన్నారు. 22 తేదీన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులూ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులూ, యువకులతో కలిసి దీక్ష చేపడతామని తెలిపారు.

కనీస మద్దతు ధరపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఖరీఫ్‌లో రైతులు పండిచిన ధాన్యాన్ని దళారులు, మధ్యవర్తులకు అమ్ముకొని మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధరపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ డిఎం ఎం.దేవుల నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన రైతులు నష్టపోకూడదనే లక్ష్యంతో ధాన్యం సేకరణలో నాణ్యత ప్రమాణాలకు లోబడి వున్న ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు కాకినాడ జిల్లాలో 277 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను, హమాలీలను రవాణా వాహనాలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తోందన్నారు. ఇవన్నీ ఒకవేళ రైతు ఏర్పాటు చేసుకుంటే వాటి సొమ్మును కూడా ప్రభుత్వమే నేరుగా రైతు ఖాతాలలో జమ చేస్తుందన్నారు.

పిడుగుపాటుతో విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

వర్షం ప్రభావంతో పిడుగులు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జాతీయ రహదా 216 కేశవ స్వామి కాలనీ సెంటర్లో ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టం పరిధిలో పిడుగు పడింది. దీని ప్రభావంతో అదే ప్రాంతంలో పల్లిపాలెం, పి.మల్లవరం వెళ్లే రెండు విద్యుత్ సర్వీసులు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టడంతో సరఫరాను పునరుద్ధరించారు. పిడుగుపాటు సమయంలో ఈ ప్రాంతంలో ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టం విద్యుత్ బల్బుల నుంచి, స్తంభం నుంచి కాంతులు ప్రసరించాయని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో రోడ్డు చెంతన నిలబడిన స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నేరాలు ఘోరాలు

లైంగిక వేధింపుల కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - కాట్రేనికోన

బాలికను లైంగికంగా వేధించిన వివాహితుడిపై శనివారం కేసు నమోదు చేసిన పోలీసులు అతనిని రిమాండుకు తరలించారు. వివరాలు ఇవి.. కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని జిల్లెళ్లవారి పేటలో వివాహితుడు వాకపల్లి ఏసు బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తన తల్లిదండ్రులు సహాయంతో కాట్రేనికోన పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. వివాహితుడు ఏసుపై పోలీసులు శనివారం పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం ఆతనిని కోర్టుకు తరలించగా, కోర్టు నిందితునికి రిమాండ్ విధించింది. పోలీసులు నిందితుడిని సబ్ జైలుకు తరలించారు.

నలుగురు పోలీసుల సస్పెన్షన్

ప్రజాశక్తి - పెరవలి

రికవరీ సొమ్ములో చేతివాటం ప్రదర్శించిన సిఐ, ఎస్ఐ, రైటర్, కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. నిడదవోలు సర్కిల్ పెరవలి పోలీస్ స్టేషన్ పరిధిలో అన్నవరప్పాడు పరిసర ప్రాంతంలో పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సెప్టెంబర్ 9న పేకాటి శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురునిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6.45 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసులో మాత్రం రూ.55 వేలు మాత్రమే దొరికినట్లు చూపారు. విషయం ఎస్‌పి నరసింహ కిశోర్ దృష్టికి వెళ్లింది. ఈ మేరకు ఉన్నతాధికారులు రహస్య విచారణ చేపట్టారు. ఖాకీల చేతివాటం రుజువు కావడంతో నలుగురుపై సస్పెన్షన్ వేటుకు ఆదేశాలు జారీ చేశారు.

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి బాడవ హై స్కూల్ సమీపంలో 216వ జాతీయ రహదారిలో లారీని వ్యాన్ ఢీ కొట్టిన సంఘటనలో నలుగురుకి గాయాలయ్యాయి అమలాపురం వైపు వెళుతున్న ఊక లారీని మామిడికుదురు వైపు వస్తున్న వ్యాన్ ఢీ కొట్టి తిరగబడింది. శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో వ్యానులో ఉన్న డ్రైవర్, క్లీనర్లతో పాటు, లారీ డ్రైవర్, క్లీనర్ కు స్వల్ప గాయాలయ్యాయి చికిత్స నిమిత్తం వారిని అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

పాము కాటుతో విద్యార్థిని మరణం

ప్రజాశక్తి -కరప

కరప మండలం సిరిపురం గ్రామానికి చెందిన రెండవ తరగతి విద్యార్థిని పాముకాటుకు గురై మతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. పూలపల్లి నాగరాజు కుమార్తె పూలపల్లి ఉషశ్రీ (8) ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. పాఠశాలలో ఉదయం 7.30 గంటలకు జ్వరం రావడంతో వెంటనే 108లో చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా వైద్యులు విద్యార్థిని పరీక్షించి ఎడమ కాలుపై పాము కాటు వేసిందన అనుమానించి వైద్యులు చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

కొబ్బరి చెట్టు మీద నుండి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. ఈ నెల 10వ తేదీన రామచంద్రపురం మండలం కాపవరం గ్రామానికి చెందిన కొబ్బరికాయలు దింపు కార్మికుడు కరప మండలం వడ్డీపాలెం గ్రామంలోని కొబ్బరి చెట్టుపై నుంచికాయలు దింపుతుండగా ప్రమాదవశాస్తూ కింద పడిపోయాడు. అతనిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ తరలించగా శనివారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్య సిబ్బంది

వ్యాధులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -ఏలేశ్వరం

సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పి.రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని మార్కండేయపురంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో అంటువ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని తెలిపారు. గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిహెచ్.జి.ఆనంద్, వైద్యాధికారి డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, సిబ్బంది కె.దైవకృప, ఇ.జగదీష్, టి.బేబీ శకుంతల, జి.గౌతమి, గ్రామ కార్యదర్శి ఆర్.వీరరాజు, సిబ్బంది ఆశ కార్యకర్తలు ఉన్నారు.

వల్లభస్వామికి రూ.1.62 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.94,380 అన్నదాన విరాళాల ద్వారా రూ.42,571, కేశఖండన ద్వారా రూ.5,920, తులాభారం ద్వారా రూ.300, లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.19,275 మొత్తం రూ.1,62,446 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు.

హామీలు సరే... ఆచరణ ఏదీ..?

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఆచరణలో మరిచింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉచిత ఇసుక విధానమే దీనికి నిదర్శనం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఉచితం హామీ నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. అప్పోసప్పో చేసి ఇసుకను కొనుగోలు చేద్దామన్నా ఇసుక రేణువులు కూడా దొరకని పరిస్థితి. నిర్మాణ పనులను ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భవన నిర్మాణ రంగంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఎ దీంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన 26 రంగాల కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. పనుల్లేక పస్తులుంటున్నారు. అ నెల 16 నుంచి ఉచిత ఇసుక అందుబాటులో ఉంటుందని కలెక్టర్ స్వయంగా ప్రకటరించారు. జిల్లాకు 14 వరకూ ఓపెన్ రీచ్‌లు కేటాయించామని తెలిపారు. సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలంటూ చెప్పుకొచ్చారు. ఇదంతా భాగానే ఉన్నా... ప్రకటన వెలువడి నాలుగు రోజులైనా నేటికీ ఇసుక దొరకని పరిస్థితి. ఆన్‌లైన్‌లో బుకింగ చేసుకోవడం పెద్ద ప్రహసనంగా మారింది. సాంకేతిక కారణాల ఫలితంగా రోజుల తరబడి కొనుగోలు దారులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఆఫ్‌లైన్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడక్కడా ఒకటిరెండు ఎడ్లబళ్లు, ఒకటి రెండు ట్రాక్టర్ల ఇసుక తప్ప ఎక్కడా పూర్తిస్థాయిలో ఇసుక దొరకని పరిస్థితి. ఉచితం మాట ఎలా ఉన్నా కనీసం ఇసుకైనా ఇప్పించి ఉపాధి చూపండంటూ భవన నిర్మాణ రంగ కార్మికులు వేడుకుంటున్నారు.

ఇసుక దొరక్క భవన నిర్మాణ కార్మికులు నానా ఇబ్బందులు పడుతుంతే నూతన మద్యం పాలసీ పుణ్యమా అని ఎక్కడికక్కడ మద్యం మాత్రం ఏరులై పారుతోంది. నూతన మద్యం పాలసీతో గుడి, బడి ఇలాంటివేమీ పట్టించుకోకుండా మద్యం దుకాణాలు వెలశాయి. ఇళ్ల మధ్య దుకాణాలు తొలగించాలని మహిళలు రోడ్డెక్కుతున్నా... సర్కారులో మాత్రం ఎలాంటి చలనం లేదు. మద్యంపై ఆదాయమే పరమావధిగా సర్కారు తీరు ఉండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కొత్త దుకాణాల్లో పాత మద్యాన్నే పాత ధరలకే అమ్మడంపై మందుబాబులు సైతం పెదవి విరుస్తున్నారు. 2024 ఎన్నికల్లో 'నాణ్యమైన మద్యం సరసమైన ధర' అంటూ నిస్సిగ్గుగా హామీ ఇచ్చిన కూటమి అనుకున్నట్టే ఆఘమేఘాలపై టెండర్లను ప్రక్రియను పూర్తిచేసి ప్రయివేటు మద్యం షాపులకు అనుమతులు ఇచ్చేసింది. టెండర్లు, లాటరీ, షాపుల ఏర్పాటు చక చకా జరిగిపోయాయి. అయితే అడుగడుగునా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో మద్యం సిండికేట్ చక్రం తిప్పిందనేది బహిరంగ రహస్యమే. అయితే గతంలో విక్రయించిన ధరలూ, అవే బ్రాండ్లు ఉండటంతో మందుబాబులు సైతం విస్తుపోతున్నారు.

మరో పక్క ఉమ్మడి జిల్లాను వరుణుడు వీడట్లేదు. జిల్లా వ్యాప్తంగా వరి కోతలు వడివడిగా ప్రారంభం అవుతున్నాయి. ఈ సమయంలో బంగాళాఖాతంలో ఒక వాయుగుండం రెండు రోజుల క్రితం తీరం దాటింది. ఈ సమయంలో కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల ధాన్యం తడిసిపోయింది. తరువాత రెండు రోజుల పాటు ఎండలు కాడంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. ఇదే సమయంలో వాతావరణ శాఖ మరో వాయుగుండం హెచ్చరికలు చేయడంతో రైతుల్లో మళ్లీ ఆందోళన నెలకొంది. ఈ నెల రెండో వారం నుంచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కొనుగోళ్లు మాత్రం అనుకున్న రీతిలో జరగట్లేదు. నిబంధనలు, దళారుల రాకతో అన్నదాతలు విస్తుపోతున్నారు. చేసేది లేక కొంత మంది అయినకాడికి దళారులకు అమ్ముకుంటున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు సమాయత్తం

ఎంఎల్‌సి ఎన్నికలకు ఉభయగోదావరి జిల్లాల్లో రాజకీయ పార్టీలు సంసిద్ధమవుతున్నాయి. ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలతో పాటు పలు ప్రజా సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపిన చరిత్ర పిడిఎఫ్ ఎంఎల్‌సిల సొంతం. తాజాగా ఉపాధ్యాయ ఉద్యమాల్లో కీలకంగా పనిచేసిన గోపిమూర్తి పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలో నిలిచారు. మండలిలో తమ గళం వినిపించేందుకు గోపిమూర్తిని గెలిపించుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు నడుంబిగించాయి. ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతం చేస్తున్నాయి. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం కూడా ఉపాధ్యాయ సంఘాలు సూచించిన వ్యక్తిని బలపర్చేందుకు పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ఇటీవల రాజమహేంద్రవరంలో మంత్రులు, ఎంఎల్ఎలు, ఇతర కీలక నాయకుల ఆధ్వర్యంలో సమావేశాన్ని సైతం నిర్వహించింది. కోనసీమకు చెందిన అభ్యర్థిని బరిలో ఉంచాలని నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. దాదాపుగా ఖరారైన అధినేత ప్రకటన కోసం అందరూ వేచి చూస్తున్నారు.

వైసిపికి పంపన రాజీనామా

ప్రజాశక్తి-కాకినాడ

వైసిపికి కాకినాడ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పంపన రామకృష్ణ రాజీనామా చేశారు. రాజీనామాను పార్టీ అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పంపినట్లు ఆయన తెలిపారు. 25 ఏళ్లుగా తను రాజకీయాల్లో ఉన్నానని కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారన్నారు. వైసిపి ఏర్పడిన తరువాత క్రియాశీలంగా పని చేసానని, కొన్ని అనివార్య కారణాలవల్ల పదవికి, పార్టీకి రాజీనామా చేశారని తెలిపారు. వైసిపి కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జి కురసాల కన్నబాబు ప్రవర్తన వల్లే రాజీనామా చేస్తున్నానన్నారు. రాష్ట్రస్థాయిలో తనకు ఒక పదవి వస్తుంటే దాన్ని కన్నబాబు అడ్డుకున్నారన్నారు. గ్రామస్థాయిలో ఉన్న కార్యకర్తకు ఇచ్చిన గౌరవం తనకు కన్నబాబు ఇవ్వకపోవడం వల్ల మనస్తాపానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఆదిత్యలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై వర్క్ షాప్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ డిపార్ట్మెంట్ వారిచే 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్లికేషన్స్" అంశంపై శనివారం వర్క్ షాప్ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ సదస్సుకు ట్రైనర్‌గా విశిష్ట ఇన్నోవేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీసాయి సందీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఇంటర్నెట్ యుగంలో నందు ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా వివిధ పరికరాలను అనుసంధానం చేయవచ్చని, నూతన ప్రాజెక్టు అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో కూడా ప్రాజెక్టు అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. డాక్టర్ ఆర్‌వివి.కృష్ణ, సిహెచ్.జానకీ దేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ బివి.విజయశ్రీ, వి.ప్రీతి పాల్గొన్నారు.

పదవితో మరింత పెరిగిన బాధ్యత

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

కాకినాడ జిజిహెచ్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్‌గా మరింత బాధ్యత పెరిగిందని వాకతిప్పకు చెందిన రావు అక్షయ్ అన్నారు. ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ తనపై నమ్మకంతో కీలకమైన బాధ్యతను అప్పగించారని తెలిపారు. జిజి హెచ్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ గా నియమితులైనట్టు జిజిహెచ్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించే విధంగా చూస్తారన్నారు.



కాకినాడలోని ఐడియల్ కాలేజీ

ఐడియల్ కాలేజీకి నాక్-ఎ గ్రేడ్

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలోని ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలకు బెంగళూరు నాక్ కౌన్సిల్ 3వ సైకిల్‌లో నాక్ ఎ గ్రేడ్ ప్రకటించారు. కళాశాలకు ఈ నెల 3, 4 తేదీల్లో నాక్ పీర్ టీమ్ వచ్చి కళాశాల సందర్శించి సంతృప్తి ప్రకటించి ఎ గ్రేడ్ ప్రకటించినందుకు ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతల తెలియజేశారు. ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన ప్రిన్సిపల్ డాక పి.సత్యనారాయణ, కళాశాల అధ్యాపక బందానికి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి అభినందనలు తెలిపారు.


సిఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

సిఎం చంద్రబాబుతో ఎంఎల్ఎ సత్యప్రభ భేటీ

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్తిపాడు ఎంఎల్ఎ సత్యప్రభ కలిసి ప్రత్తిపాడు నియోజకవర్గంలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, రైతుల కోసం పుంత రోడ్లు ఏర్పాటు చేయాలని, రౌతులపూడి మండలంలో చెక్ డ్యాములు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్టు ఎంఎల్ఎ తెలిపారు. దీనిపై సిఎం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు సాధించేలా శిక్షణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ సూచించారు. శనివారం పట్టణంలోని ప్రతిభా విద్యా నికేతన్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల తరగతులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మమేకమై, ఒత్తిడిని జయిస్తూ విజయాల వైపు ఎలా అడుగులు వేయాలో దిశా నిర్దేశం చేశారు. రాబోయే పరీక్షల్లో అత్యున్నత విజయాలను అందుకోవాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, సిఆర్‌పిలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వివి.ప్రకాష్, ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరి పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

పారిశుధ్య కార్మికులను నియమించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని సిపిఎం శాఖా కార్యదర్శి కరణం గోవిందరాజు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శాఖ కార్యదర్శిగా కరణం గోవిందరాజు ఎన్నికయ్యారు. అనంతర ఆయన అనేక చోట్ల పారిశుధ్య లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పట్టణంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. కుటమి ప్రభుత్వంలో ట్రూఅప్ ఛార్జీలు వేయడం దారుణమన్నారు. వెంటనే ఛార్జీలను ఉపసంహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరణం శ్రీనివాస్, దారబాని కృష్ణ, కరణం సత్యనారాయణ, కోన శివకుమార్, సైపురెడ్డి యువరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్స్‌కు బకాయి జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ

నగర పాలక సంస్థ పరిధిలో క్లీన్ ఎపి వాహన డ్రైవర్స్‌కు ఆగస్టు, సెప్టెంబర్ నెల జీతాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ భావన, అదనపు కమిషనర్ సుధాకర్‌ను కలిసి శనివారం విన్నవించారు.కమిషనర్ భావన మాట్లాడుతూ తాను డిఎంఎ సమావేశానికి వెళుతున్నానని, వచ్చిన తరువాత పరిశీలిస్తామని తెలిపారు. అదనపు కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు అమలు చేస్తామని, 4 రోజులపాటు వేచి ఉండాలన్నారు. అంతకు ముందే స్వయంభూ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం వారికి కూడా లేఖ పంపించినట్లు సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు తెలిపారు. క్లాప్ వాహన డ్రైవర్స్‌కు ఏనాడూ 10వ తేదీ లోపు జీతాలు చెల్లించలేదన్నారు. వారాంతపు సెలవులు అమలు కావడం లేదన్నారు. 2024 ఫిబ్రవరి నుండి పిఎఫ్, ఈఎస్ఐ డ్రైవర్స్ ఖాతాలకు జమ కాలేదన్నారు. అధికారులను కలిసిన వారిలో డ్రైవర్స్ ఇస్మాయిల్, దుర్గా ప్రసాద్, భైరవస్వామి, శివ ఉన్నారు.

రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి -సామర్లకోట

అడుగడుగునా గోతులు శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురించిన కథనంపై పోలీసులు, టిడిపి నాయకులు స్పందించారు. తమ వంతుగా రోడ్డు గోతులు పూడ్చడానికి శ్రీకారం చుట్టారు. సామర్లకోట నుంచి వికె రాయపూరం వరకు విపరీతంగా రోడ్డుకు గుంతలు ఏర్పడడంతో సామర్లకోట పోలీసు అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టారు. సామర్లకోట సిఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ కడప గంగరాజు ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. పాలకుర్తి శ్రీనుబాబు, టిడిపి మండల అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ పారిశ్రామిక సందర్శనలో భాగంగా వేమగిరిలోని పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్‌ను సందర్శించినట్టు విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహిస్తున్న సంస్థ అని, సిబ్బంది పవర్ గ్రిడ్ నిర్వహణను విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక సందర్శనల ప్రాధాన్యతను తెలిపారు. ఇటువంటి పారిశ్రామిక సందర్శన ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానం పొందడానికి ఎంతో దోహదపడుతుంది అని వివరించారు.

సర్పంచ్‌గా అనూష బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కరప

కరప మండలం గొడ్డటిపాలెం సర్పంచ్‌గా ఉపసర్పంచ్ గోన అనూష శనివారం బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్‌గా గెలుపొందిన వాసంశెట్టి శ్రీనివాస్‌కు ప్రభుత్వ ఉద్యోగం రావడంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎంఎల్ఎ పంతం నానాజీ ఆదేశాల మేరకు ఉప సర్పంచ్ అనూష సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ సూపరిండెంట్ బిఎల్ నరసింహం, భోగి రెడ్డి గంగాధర్, గోన అంజి, నక్క బ్రహ్మజీ, ఆలమూరు చిన్నారావ్, ఎం.శ్రీను శంకర్, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి : ముదునూరి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వైసిపి బలోపేతానికి అందరం కలిసి పని చేద్దామని పార్టీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ధర్మవరంలో కృష్ణంరాజును గజ్జనపూడి, పోతులూరు, యుజె.పురం, వెంకటనగరం, వాకపల్లి, గ్రామాలకు చెందిన వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు కలిసి అభినందనలు తెలిపారు. కృష్ణంరాజు పార్టీలో రావడంతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని గజ్జనపూడి సర్పంచ్ గోనగాల అప్పలరాజు, మాజీ ఎంపిటిసి అల్లు సత్తిబాబు, శెట్టి సత్తిబాబు, ముప్పిడి ఏసుబాబు, అనకాపల్లి నూకరాజు, రేఖ కృష్ణార్జున, బర్ల గోవింద్, ఒట్టు కోళ్ల నూకరాజు తెలిపారు.


సిఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

బాస్కెట్ బాల్ టీమ్ ఎంపిక

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ టీమ్ సెలక్షన్ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొని ఆదిత్య యూనివర్సిటీ టీముకు ఎంపికైన క్రీడాకారులు అందరినీ యూనివర్సిటీ యాజమాన్యం అభినందించింది. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ టీమ్ సభ్యులందరూ క్రీడా స్ఫూర్తితో మెలుగుతూ చక్కటి ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ త్రిపాఠి, డాక్టర్ ఎన్.రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

వరహాలయ్య పేటలోని బచ్చు వీరరాఘవమ్మ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో మిషన్ అన్నపూర్ణ సహాయనిధి సంస్థ ద్వారా శనివారం విద్యార్థులకు భోజనం కంచాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ సంస్థ వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ మాట్లాడారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సామగ్రిని అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మోజు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


నిరసన తెలుపుతున్న కనకాలపేట వాసులు

డంపింగ్ యార్డు తరలించాలని ఆందోళన

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట ఏటిగట్టు రోడ్డులోని డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని కనకాల పేట గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా డంపింగ్ యార్డును తరలించాలని ముక్తకంఠంతో ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని కోన సుబ్బారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజలు, విద్యార్థులు రోడ్డుపై రాకపోకలు సాగించడానికి దుర్గంధం వల్ల అవస్థలు పడుతున్నారన్నారు.

అధికారులతో మల్లాడి సమావేశం

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ సమస్యలు, అభివద్ధి పనులపై స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో వివిధ శాఖల అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో స్మార్ట్ స్కూల్ ప్రతిపాదన మేరకు ఈ నెల 4వ తేదీన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఏడు స్కూల్స్ ఎంపిక కాగా ప్రతి హైస్కూల్లో ఐదు స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సిఎస్ఆర్ నిధులలో చేపట్టే అభివృద్ధి పనులకు బుధవారం నాటికి టెండర్లకు పిలవాలన్నారు. సాయి స్పోర్ట్స్ హాస్టల్, మెట్టకూరు గ్రామ డెవలప్మెంట్, అయ్యన్న నగర్ బ్రిడ్జింగ్ వర్క్, ఇందిరాగాంధీ మార్కెట్లో అభివద్ధి పనులు, తదితరవాటికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంటానని తెలిపారు. మున్సిపాలిటీ, పిడబ్ల్యుడి శాఖల్లో పెండింగ్లో ఉన్న పనులను మొదలు పెట్టాలని, దానికి సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు. ఆంధ్రాలో సరిహద్దు ప్రాంతంలో ఉన్న పందులంక భూమి యానంకు చెందినదని కోర్టు తీర్పు ఇచ్చిందని ఎలాంటి గొడవలు జరగకుండా పోలీస్ శాఖ,రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారులు చూసుకోవాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో గంజాయిని విక్రయిస్తున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌పి రాజశేఖరన్ తెలిపారు. స్థానిక రీజెన్సీ స్కూల్‌కు వెళ్లే పరిసర ప్రాంతంలో నలుగురు యువకులు గంజాయిని విక్రయిస్తుండగా క్రైమ్ టీమ్ దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. యానాం ఫెర్రీరోడ్డుకు చెందిన సంగాడి మహేష్ బాబు, తాళ్లరేవు మండలం సీతారామపురానికి చెందిన గెడ్డం రాజు, అయ్యన్ననగర్‌కు చెందిన పెసింగి నాని, పెనుపోతు విజయదుర్గావరప్రసాద్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 500 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను యానాం సబ్ కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఈ సమావేశంలో సిఐ షణ్ముగం, ఎస్సై మురుగునందమ్ పాల్గొన్నారు.